కాడీమెదవని అనుకునేసరికి ఛాతీ పెరిగింది మల్లన్నకు. శరీరంలో ఏదో కొత్తశక్తి ప్రవేశించింది. మంచంమీద నుంచి లేచి కూర్చున్నాడు. కుడిచేత్తో కళ్ళు తుడుచుకుని చుట్టూచూశాడు.

అప్పటికప్పుడే పొద్దువాటారింది. ఆకాశంనిండా నల్లటిమేఘాలు దట్టంగా క్రమ్ముకొస్తున్నాయి. పక్షి ఒకటి ఏదో ఎర్రటి పండును కరచుకొని ఉత్తర దిశగా ఎగురుతూ పోతున్నది. మల్లన్న పడుకున్న మంచానికి ప్రక్కగావున్న మునగచెట్టు మీద కాకి అదేపనిగా అరుస్తున్నది

'నీకేం పొయ్యేకాల మొచ్చిందే అట్టా అరుస్తుండావ్' అని విసుక్కుని గుడిసెలోకి దృష్టి సారించేడు.

రత్తి పొయ్యిలో తలదూర్చి నిప్పును వూదుతున్నది. అరచేతులు రెండూ నుదుటి కానించుకుని గొంతుకూర్చున్నాడు నారాయణ.

మల్లన్న మంచంమీదనుంచీ లేచాడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ గుడిసెలోకి వచ్చాడు.

రత్తి ప్రక్కకువచ్చి నుంచున్న తండ్రినితలెత్తిచూసేడు నారాయణ. మల్లన్న గూట్లోవున్న ముంత అందుకుంటూ వుండగా ఆ అలికిడికి ఇటుతిరిగింది రత్తి.

“ఏడకిపోతావయ్యా, డబ్బులు తీసుకుంటున్నావ్ ? పొద్దుగూకింది”

రత్తి మాటల్లో ధ్వనించిన భయాన్ని నారాయణ మాత్రం గమనించగలిగేడు.

కాలు సాగింది. సాగుతున్న మల్లన్న కాలికి ఏదో మెత్తగా తగిలింది. వంగి చేత్తో పైకి తీసి చూసేడు.

చించిన తెల్లటి గుడ్డ పీలిక!

గుండెల్లో దుఃఖాన్ని స్మృతి బయటకు దేవింది. అప్రయత్నంగా కింద కూలబడిపోయేడు మల్లన్న.

"అవును, ఇక్కడే! ఇక్కడే నాబాబును పొట్టన పెట్టుకున్నారు" — కైపుతో కెంపులైన కళ్ళలో కడుపు తీపి సుళ్ళు తిరిగింది.

—— కాలానికి వేసిన కళ్ళెం నిలువలేదు.

మల్లన్న లేచేడు. పరపర లాడిన్నై పళ్ళు! బిగపడి పోయిన్నై పిడికిళ్ళు! ముందుకు చూసిన్నై కళ్ళు!!

గమ్యం ఒక్కటే అయినా—ధ్యేయం, సాధనలాగా చీలిపోయినాయి కాలిబాట, బళ్ళదారి!

'రెడ్డి చావుకుకూడా యిదే సరయినచోటు' — మల్లన్న గొణుక్కున్నాడు. 'ఆడుసేసిన, సేస్తున్న ఘోరాలకి ఇయ్యాల్టితో సరి.'

— తుమ్మ మొద్దులో దిగపడి పోయింది కత్తి. ఎడంచేయి చెట్టుకు వూతగా పెట్టి బళ్ళదారివేపు చూపులు నిగిడ్చేడు. నీరవ నిశ్శబ్దంలో తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను తనే వినగలుగుతున్నాడు.

క్షణాలు గడుస్తున్నాయి.

దూరంగా చిరుగంటలు గలగల లాడిన్నై. మల్లన్న ముఖంలో ఆతృత తొంగి చూసింది. కత్తిని లాగి చేత్తో

